

# అనంతయాత్ర

పంతులసావిత్రి

కథానిక

ఒక యుద్ధనౌక...

అర్థరాత్రి నడిసముద్రంలో నడక సాగిస్తూంది. అననుకూల వాతావరణంలో అలుస్తూ సొలుస్తూ పరుగెత్త యత్నించే నిండు చూలాలులాగ నడక సాగిస్తోంది. ఏ రోజున ఏ రేవు చేరుకోవాలో స్పష్టంగా చెప్పడం సాధ్యంకాదు. అనేక రకాల వ్యక్తు లందులో వున్నారు. ఎన్నో జాతులు... ఎన్నో భాషలు. స్త్రీలు...పురుషులు! అందరి కన్నా పెద్దవాడికీ - చిన్నవాడికీ వయస్సులో అంతర్యం ముప్ఫై సంవత్సరాలపైగా వుంటుంది. నల్లని మబ్బులతో నిండిన ఆకాశం. అంతు తెలియని సాగరమధ్యం...ఓడలో ఏమాత్రం వెల్తురూ వుండ కూడదనే కట్టు నియమం... నిశీథమయం.

నావలో ప్రతివ్యక్తి ముఖంలోని ఒక రకమైన నిస్పృహా నిస్సత్తువ అలుముకున్నై. అంతా గోలగా ఏమేమో ముట్లాడేసుకుంటున్నారు....ఏవో మాటలు...అర్థరహితమైనవి...ఆ సంభాషణలకి ఓ అంతూ క్రమమూ కూడా లేదు.

"డెక్"మీద కూర్చుని సిగరెట్ వెలిగించేను. అది ఆ ఉదయంనుంచి బహుశ: ఏభైవొకటవ సిగరెట్ కావచ్చు. దగ్గరలోనే కూర్చున్న యిద్దరు వ్యక్తుల సంభాషణ బలవంతంగా వినిపిస్తూంది.

"యుద్ధం జీవితంలో ఓ విచిత్రమైన ఆనందాన్ని, అనుభవాన్ని కలిగిస్తుందంటారు...'కోటి కోట్ల జనసందోహం - నాశనమందుట-ప్రపంచ శాంతికి స్వాగతమేనని' మీరూ విశ్వసిస్తున్నారనుకుంటా?"

"నా జీవితంలో చాలా భాగం భవాలెన్నో కలుగుతుంటాయన్న మాట వాస్తవమే కాని అవన్నీ ఆనందమయమేనని చెప్పుకోవటం కేవలం ఆత్మసంతృప్తికోసం చేసుకునే వృధా ప్రయత్నం... పైగా యుద్ధభూమిలో తొలి తుపాకి పేలేసరికి ప్రతిసిపాయికీ రక్తం చల్లపడిపోతుంది. ముఖం పాలిపోతుంది. ఆవేశంతోపాటు దుర్ఘటన లారంభమవుతాయి. భాయీ ఆ క్షణంలో జీవితం మృత్యువు,వీరత్వం, నిర్దయ, అనర్థనం...అన్నీ ఒకేసారి ఒకేరూపంలో గోచరిస్తాయి."

అదృష్టానికి కూడా అందులో భాగముందనుకుంటా?"

"అబ్బే! నాకుగా నేను మాత్రం ఆ మాటనట్టే విశ్వసించను. ఉదాహరణకి నేను గత మహాయుద్ధంలో విమానం నడుపుతూ వుండేవాడిని. ఆ వుద్యోగంలో నా ధైర్యానికి, సాహసానికి యివిగో యీ ఆరు పుంజీల పతకాలే సాక్షి! ఎన్నో ఎత్తైన పర్వతాల మీద ఏత్తైన నీటి మధ్యలో విమానాల్ని దింపేశాను. అవసరం కొలది ఆరు విమానాల్ని నాశనంచేసి సురక్షితంగా బయటపడ్డాను. 'భయం' నాదగ్గర భయపడుతుందని నాపై అధికార్లు నన్నభినందిస్తూ వుండేవారు...యిలావుండగా ఓసారి శెలవుమీద యింటికి వెళ్ళినప్పుడు కాలికి చిన్నరాయి తగిలి నొప్పిచేస్తే ఆరుమాసాలు 'హాస్పటాలు'లో వుండి యమయాతనపడ్డాను. పైగా సెప్టిక్కైందని కాలి వేలుకూడా కోసేసేరు"...జోడువిప్పి చూపెట్టేడాయన.

"దేవుడిమాయ" అంటూ రెండో ఆయన ఎంతో బరువైన సత్యాన్ని

ప్రయోగించేదు.

"దేవుడి మాయ కాదు... దేవుడి దౌర్జన్యం... కేవలం పదహారణాలపరక దౌర్జన్యం... లేకపోతే కొన్ని వేలమందిలో ఏ ఒక్కడికో మాత్రం పూర్తిగా తిండితిని. సంతృప్తిగా జీవించవలసిన అవకాశం ఎందుకు లభ్యం కావాలి? ఇవాళటి 'అమీరు' రేపటికి ఫకీరు. నేటి ఫకీరు రేపటికి అమీరు ఎట్లా అయిపోతున్నారు?... నేను చిన్నప్పుడు ఇంజనీరింగు చదవాలని అనుకుంటుండేవాడ్ని. కాని అట్లా కాలేదు. అంటే ఇది నా "ఖర్మం"లో రాసివుందని కాదు నా అభిప్రాయం! పూర్తిగా నా అశ్రద్ధే యిందుకు కారణాలు. అసలు దేవుడ్ని ప్రార్థించడంలో నాకు చాలా తక్కువ నమ్మకం! ఎందుకంటారేమో? మనం యుద్ధంచేసే సిపాయిలం కదండీ! మనకి వాళ్లు శత్రువులయితే వాళ్ళకి మనమూ శత్రువులమే! మనం కోరే విజయమే వాళ్ళూ కోరతారు! అందరిదీ నిజమైన ప్రార్థనే ఐతే..."పాపం. భగవంతుడు మాత్రం ఎవరిప్రార్థనని వినగలడు? అహ్. మానవుడెంత తుచ్ఛుడు? ఎన్ని రకాల మానవులో? ఎన్ని వ్యవస్థలో? ఎందరో సూర్యులు? ఎందరో చంద్రులు? ఎన్నో నక్షత్రాలు? అంతా ప్రకృతి... అహ్!"

"ఏంభాయ్. మీరు చాలా మారిపోయినట్లుందే! ఇదివరకు మనం కలుసుకున్నప్పటికంటే మీతత్వం చాలా భిన్నంగా కనిపిస్తోంది కదూ?"

"మారింది నేను కాదండీ మహాత్మా! మారిందీ—మారుతూన్నదీ ప్రపంచం. ప్రపంచధర్మమూనూ... హాఁ. నేనుమాత్రం పూర్వంలాగా ప్రతి చిన్న విషయానికీ ఫరవా చెయ్యడం మానేశాను. ఏ వస్తువుకోసం నా కెక్కువ ఆశకూడాలేదు. కనీసావసరాలకు మించిన ఆ కాంక్షాలేదు... పూజలు ప్రార్థనలూ పూర్తిగా మానేసేను ఆశయంలేదు. ఆదర్శంలేదు. అట్టే ఆలోచిస్తే బుర్ర వేడెక్కిపోతుంది కదండీ... వెంటనే, ఇదిగో ఈమందు—"

చెరోగ్లాసూ 'బీరు' ఖాళీ చేసేరు.

"ఇదికూడా యీ రోజుల్లో మంచిరకం దొరకడంలేదు. నేను మాత్రం కాస్త ముందుగానే తెనులుకొని కొన్ని పెట్టెల సీసాలట్టే పెట్టేను లెండి. మీరు శలవు తీసుకొని ఒక్కసారి మా

హాయిగా తాగుదాం... రాత్రల్లా సార్ట్రీలు డాన్సులు పూర్తిగా తిరుగుదాం-వాచీలన్నీ ఆపేద్దాం. కేలండర్లు తిరగలేసేట్టేద్దాం... పగటివేళ పడుకుందాం. మస్తుగా... ప్రశాంతంగా... ఏం? వస్తారు కదూ? ఎప్పట్లో వస్తారో ముందుగా తెలియచెయ్యండేం?"

"ఆఁ ఎప్పుడొస్తానో అనే ఆలోచిస్తున్నా"

ఇద్దరికీ స్ఫురించినట్లుంది. భయంకర పారావార మధ్యంలో విరామ మెరుగని అనంతయానం సాగిస్తున్న విషయం. ఇద్దరిముఖాలు పాలిపోయేయి మరో రెండు గ్లాసులు బీరుతోనిండి వెంటనే ఖాళీ అయినాయి.

* * •

చీకటి కారుచీకటైంది. తుఫానుగాలి తీవ్రతరమై నావను ఊపుతలూగిస్తోంది. చలిగాలి చెవుల్లో దూరకుండా మఫ్లర్ సర్దుకొని యింకో సిగరెట్టు వెలిగించాను. సిగరెట్టు లైటరు వెలుగులో జిగేల్మంది ఆమెరూపం. నాకు చాలా దగ్గర్లో నేవుంది ఆమె... నేను ఆమెను గుర్తించడంలో కూడా ఏమంత ఆలస్యం కాలేదు. అయినా యీనాటి ఆమెముఖంలోని ఉదారతలోంచి అలనాటి రంగేళీతనాన్ని వూహించి చూడ్డం కష్టమే!... పరిశీలనగా ఆమెను చూట్టంతోనే మా సంభాషణకూడా ఆరంభమైంది. మాసిపోయిన మధురస్మృతులు ... గతం... వర్తమానం... భవిష్యత్తూ... ఎన్నో విషయాలు యిట్టే దొర్లిపోయినాయి. మా మాటల్లో ...

"మీ మాటల్లో చాలా పరిపక్వం వచ్చిందే. మీకీ గాంభీర్యం ఎవరిచ్చేరో?" అన్నదామె.

"మీకీ ఉదాసీనత ఎక్కడలవడింది? బహుశః ఆ రోజుల్లో మీ ఒక్క లియ్యని చూపుకోసం తనసర్వస్వాన్నీ త్యజించడానికి సిద్ధపడే నిరాశ చెందని మానవుడు లేడేమో"? అన్నాను నేను.

"అవును. ఆరోజుల్లో ఎందరినో అలాగ బాధపెట్టేదాన్ని అన్న జ్ఞాపకమే నన్నిపుడెంతో బాధిస్తోంది... ముఖ్యంగా ఆ ముసలివాడు లక్ష్మీదాసు నన్నెంతో ప్రేమించేవాడు. ఆ అభిమానాన్ని పురస్కరించుకొనే నేనాయనడబ్బుని యిష్టానుసారం వాడుకున్నాను. ఎంతో జల్సా ... ముసలివాళ్ళనే పెళ్ళి

చేసుకొని చెయ్యాలని తోటివాళ్ళలా ప్రచారం చేసి నవ్వించేదాన్ని. నిజానికి ఆయన నావల్ల పొందిన సుఖం లేశమాత్రమూ లేదనే చెప్పాలి. పాపం నన్ను కోరినవాళ్ల దరిలోకీ ఆయనొక్కడిదే నిజమైన ప్రేమ అని యీనాటికీ నమ్మకం..."

"నేనుకూడా ఆ రోజుల్లో మిమ్మల్ని ప్రేమించే వాడినని మీరు మరచిపోయేరనుకుంటాను"

"లేదుఁ... నాకు బాగా గుర్తుంది. ఒకనాటి యిటువంటిరాత్రే మీరు నన్ను అడిగారు, బలవంతంగా పట్టుకొని ముద్దుపెట్టుకుంటే ఏం చేస్తావని."

"అవును. నిజానికి అప్పుడు మీరంత అందంగా వుండేవారుకూడా"

"కాని... కాని ... యిప్పుడు తెలుస్తోంది. యీ ఒంటరితనం ఎల్లకాలం ఒంటరిబ్రతుకు ఎంత దుర్భరమైందో!... నిన్ననే నా తలలో ఒక నెరసిన వెంట్రుక కనిపించింది. ఆ మొట్టమొదటి తెల్ల వెంట్రుక నా భవిష్యత్తుకొక వికారరూపం కలిగించి నన్నెంతో భయపెడుతోంది."

కెరటాల వేగానికి హఠాత్తుగా కలిగిన ఓడ కదలికకి ఆమె ఒక్కసారి నామీదపడి వెంటనే సర్దుకొని పక్కకు తప్పుకుంది...ఆ చలనంలో ఆమె కళ్ళనిండానీరు నాకు స్పష్టంగా కనిపించింది.

ఆరిపోయిన సిగరెట్టుని నేలపడేసి చికాకుగా బూటుతో నపిపేసినా నాకు తృప్తికలగలేదు...

* * *

మూడో సిగరెట్టు వెలిగిద్దామని మూడుసార్లు ప్రయత్నించి గాలిజోరుగా వుండటంచేత కేబిన్ లోకి పోయి తలుపులన్నీ మూసేశాను. మూల నున్న లౌడ్ స్పీకరు ఒకే కాకిగోలగా మోతపెడుతోంది... వాతావరణం, అంతర్జాతీయవార్తలు. మాకన్నీ తెలిసేది ఆ స్పీకరులోంచే! వుదయం నుంచి అదెవరో... ఆయనపేరు గోలగా వినిపిస్తోంది. వార్తలారంభమవగానే స్పీకరు నోరు బందు చేసేశాను.

"లోపలికి రావచ్చునా?" అంటూనే తలుపు తోసుకొని లోపలికి వచ్చిన ఓ పెద్దమనిషి "దయచేసి యీ తంతి కాస్తా తొందరగా పంపించాలి" అన్నాడు ఆదరాబాదరాగా! చిరునామా తరు

నాతో

"మ్యావు మ్యావు. మ్యావు మ్యావని నాల్గుసార్లురాసి కింద సంతకం మాత్రం చేశాడాయన అందులో... అదే డబ్బుతో యింకోమాటకూడ చేర్చవచ్చునని చెపితే దీర్ఘంగా ఆలోచించి "సరే యింకో 'మ్యావు' చేర్చండన్నాడాయన. తన చిన్ననాటి ఉపాధ్యాయుడికి పంపిస్తున్నాడట ఆ తంతి! చూసిన వెంటనే తనఅభిప్రాయం గ్రహించగలడని పూర్తి విశ్వాసం ప్రకటించేడా మానవుడు. "మా మేస్టారు నిజంగా లోభత్వానికి ఆదర్శమూర్తి సుమండీ" చిన్ననాటి పెద్ద విషయాల్ని నెమరువేస్తున్నాయన. "అట్టే ఉపయోగిస్తే అద్దాలరిగిపోతాయని కళ్ళజోడు ఉపయోగించకుండానే చాలాసేపు కాలక్షేపం చేసేవాడు. ఎవరికైనా పొరపాటున షేకుహ్యాండన్న యిస్తే వేళ్లు లెక్కపెట్టుకుని మరీ చూసుకునేటంత జాగ్రత్త ఉండేది ఆయన దగ్గర! మా వూరు హైస్కూలుని కాలేజీ చేసినప్పుడు తన యిరవై సంవత్సరాల అనుభవాన్ని పురస్కరించుకొని తనకే ప్రిన్సిపాలు పదవి యిప్పించాలని అడిగితే "నీకు ఒకే సంవత్సరం అనుభవం యిరవైసార్లు కలిగిందని సమాధానించేరట అధికార్లు... ఆ ఉత్తరానికే యీ జవాబు!" ఒక్కసారి దీర్ఘనిశ్వాసం విడిచి ఆయన మళ్ళీ చెప్పడం ఆరంభించాడు— "ప్రతి మానవుడూ తన భవిష్యత్తుని తానే నిర్మించుకుంటాడని ఆయన నమ్మకం... హాఁ నేను కూడా అంతే నమ్ముతాను. జరిగిందల్లా మన మేలుకే నన్న మాట వింటే నాకు మహా వళ్లుమంట. జరగబోయేది వూహించి దానికితగ్గట్టుగా మనం ముందునించీ ప్రయత్నిస్తూ రావాలి. నేను వుద్యోగంలో అలాగే చేరేను. యీ రోజున ఇలా జరుగుతుందని నే నేనాడో వూహించగలిగాను. బహుశః మీరూ అనుకొనే వుంటారు... ఏం? కదూ?"

"లేదే... నే నెప్పుడూ యిట్లా వూహించలేదు!" అసమ్మతిసూచనగా బుర్రవూపేడాయన. "ఊహూఁ... మీరు తప్పకుండా వూహించేరు నాకు బాగా తెలుసు. నమ్మికూడా నమ్మనని చెప్పలేకుండా ఉన్నారు మీరు! అదేమనలో చాలా మందికి అలవాటు... మానవుడు కేవలం దుర

మా పరిచయం బాగా వృద్ధిచెందిన తరువాత 'మనలోమనమాట'గా ఆయన నాకు తెలియజేసిన సమాచారం ఏమిటంటే తన జీవితంలో యీ సముద్రయానపు తొలి అనుభవం చాలా భయం కలిగిస్తోందని అది పోగొట్టుకుందికే ఎంతసేపూ ఏవో ఆలోచిస్తూ మాట్లాడుతుంటాడట అనిన్నీ.

"చెప్పకేంగాని... నాకు చాలా భయమవుతోందండీ." అని చెప్పలేక చెప్పలేక చెప్పేశాడా మానవుడు.

"ఉత్తమాశయాలతో వున్న తాదర్శాలని సాధించి లక్ష్యసిద్ధిని పొందాలని ప్రయత్నించటం...మానవులలో అంటే మనలో గొప్పవారి కనీసస్వభావం!" స్వరంలోను శైలిలోను ఒక వుపన్యాసకుడికి వుండాల్సిన గాంభీర్యం, మృదుత్వం వున్నాయి. చుట్టూవుండే యావన్మందినీ యిట్టే ఆకర్షించి నిలబెట్టగలగటమే ఆ మాటలోవుండే ప్రత్యేకత!...విస్మృతత!...పాత్రికేయుడుగా గొప్ప అనుభవమూ. కీర్తి గడించవలసినా యీ తన జీవితపు ఆరవదశాబ్దంలోకూడా తను ఎడతెరపిలేని కృషిచేస్తూనే వున్నానన్నాడాయన! "యిది కేవలం నిస్వార్థమైన కృషి. ఇందులో నాకేమీ గడించిపెట్టుకుపోవాలని లేదు...బాల్యంలో నాజీవితం యిలాగే గడుస్తూ వచ్చింది..."

ఒక్కొక్క దమ్ముపీలుస్తుంటే ఒక్కొక్క రుచిమారుతూవచ్చింది. అదేనా దగ్గరున్న ఆఖరు సిగరెట్టు! మహాహుషారుగామాత్రం కాలుతోంది.

"నన్ను నేనే లక్ష్యపెట్టకుండా గడిపేసేను నా చిన్నతనం!" పునః ఆరంభించేడాయన. "ఒకసారి దొంగతనంగా యింట్లోంచి పారిపోవాల్సిన అవసరం కలిగింది. నాన్న జేబులో సంధించిన పాతికరూపాయలు. నన్నే నమ్మి అనుసరిస్తూన్న ఓ మిత్రుడు నాకు సహాయం! ఆఖరుకాణీ జేబులో వున్నంతవరకూ కాలం హాయిగానే గడిచింది. అటుతరువాత మా పాట్లు ఆ "అల్లా"కే తెలుసు! మూడుదినరాత్రులు పదహారణాల ఏకాదశి పాలించినతరువాత ఒక మహానుభావుని సలహాప్రకారం రాత్రి పదకొండు గంటలకి "ఫలానీ" యింటిదగ్గర "ఆయన్ని" కలిసేం! ఆయన దొంగచిన తరువాత మెమ్మదిగా ఒక యింటి కిటికీలోంచి జొరబడి తలుపులన్నీ "బందు"చేసేం!

అది వంటసాల! పొయ్యిముట్టించి ఒక్కొక్క గుడ్డు వేయించి అందించేడాయన! గుడ్లన్నీ పూర్తయిన తరువాత గోధుమ మొరుం ఉప్మా చేసేరు. ఇంకేదో చేసేలోపల ద్వారం బయట చప్పుడైంది. కొద్దిసేపు మూల దాగుకొనిమా కార్యం పునరారంభించేసరికీ తలుపుకొట్టిన శబ్దమైంది. మేం కిటికీలోంచి గెంతేలోపున ఆయన తలుపు తెరిచేసేడు. ఆశ్చర్యపడాల్సిన విషయమేమిటంటే "అది ఆ పెద్దమనిషి స్వగృహమే!"...

...అందరిముఖాలు ఒక్కసారి పరిసీలనగా చూసి తిరిగి అన్నాడాయన– "నేనుమాత్రం నాతరువాత సంతతివారికి గొప్ప ఆస్తి వదలివెల్తాను. వాళ్ళే నా ఆత్మకి శాంతి సమకూరుస్తారు... యిదిగో యిదే నా వీలునామా–" నిస్వార్థమూ... నిర్మలమూ అయిన చిరునవ్వు చిన్నపిల్లలకి లభిస్తుంది... భవిష్యత్తుమీద గొప్ప ఆశ. సాధించాలనే ఆవేశం ముఖ్యంగా యువవిద్యార్థుల హక్కు...రామనామ సంకీర్తనలు. పాపం – పుణ్యం. నరకం–స్వర్గం. ఆలోచించుకునే అవసరం ముసలివాళ్ళపరం! తీయనినొప్పి బరువైన బాధ ప్రేమవిరాగులకు సంక్రమిస్తే "శీతవెన్నెల' మలయమారుతం-రసికులైన దంపతులకోసం... నృత్య యువతుల సాంఘికచిత్రాలు నాతిగల బ్రహ్మచారులకోసం ప్రత్యేకించబడతాయి...బస్!నా వారసులకింకేం లోపం జరిగింది?ఆయన ధోరణి అకస్మాత్తుగా ఆగిపోయింది. చూపుమేరలోతీరంకనిపిస్తోందని వార్త బయలుదేరింది. అందరిలోనూ ఒకరకంఆత్ర ఆవేగం వుత్పన్నమైనాయి. ఎవరి స్థలాలలో వారు తమతమ పనుల్లో యంత్రాలలాగఅమిరిపోయేరు. కొన్ని నిమిషాలపాటు నిశ్శబ్దం నిస్తబ్ధత స్థిరంగా వున్నై...అది తీరం కాదని నిజమైన సమాచారం మాకు తెలిసేసరికి అర్థఘంట పట్టింది. గాఢమైన అంధకారంలో ఆ నల్లని నావ పడుతూ లేస్తూ తన అనంత యాత్ర సాగిస్తునేవున్నది. నావలో మళ్ళీ సంభాషణ లారంభమైనాయి. కాని ఈసారి మాటల్లోనూ ఉత్సాహం...ఉద్రేకం...లేవు!